క్లుప్తంగా

పదిలో మెరుగైన ఫలితాలను సాధించాలి



కడప ఎమ్మార్సీలో ఎంఈఓలతో చర్చిస్తున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్‌: రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులంతా మంచి ఉత్తీర్ణతను సాధించే విధంగా ఎంఈఓలు ఉపాధ్యాయులకు సూచించాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ సూచించారు. డీఈఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి సారిగా గురువారం కడప ఎమ్మార్సీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఎంఈఓ–1 పాలెం నారాయణ, ఎంఈఓ–2 ఇర్షాద్ అహ్మద్‌లతో పలు అంశాలపై చర్చించారు. మార్చి 18వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేకంగా పాఠశాలలను పర్యవేక్షించాలన్నారు. అలాగే ప్రత్యేక స్టడీ అవర్స్, పిల్లలకు స్లిప్ టెస్టులను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఇన్విజిలేషన్ విధులకు ప్రైవేటు టీచర్లను నియమించాలి

కడప ఎడ్యుకేషన్‌: రాష్ట్రవ్యాప్తంగా మార్చిలో జరగబోయే 10వ తరగతి పరీక్షల ఇన్విజిలేషన్, మూల్యాంకన విధులకు ప్రైవేటు టీచర్లను నియమించాలని ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డంరాజు కోరారు. ఈ విషయమై ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ దేవానందరెడ్డి, పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్‌లను కలిసి వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి అత్యుత్తమ ర్యాంకర్లను తీర్చిదిద్దిన ఘనత ప్రైవేటు టీచర్లకు ఉందన్నారు.

కరపత్రాలు పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : మీ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయించాలని సీనియర్ వైద్యులు డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. రాయల్ రషీద్ అసోసియేషన్ ముద్రించిన పల్స్ పోలియో కరపత్రాలను డాక్టర్ గోపీనాథ్ ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన చిన్నారి మొదలుకొని ఐదు సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. మార్చి 3వ తేదిన జరిగే కార్యక్రమంలో ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఆర్ సంస్థ ప్రతినిధి కరీముల్లా. జీవి శివరావు. శ్రీధర్. రాజేష్. యోగి. తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



సుదేవి సుహవాన, మునిరాజు దంపతులను సత్కరిస్తున్న బిషప్ పి.ఐజాక్ వరప్రసాద్

కడప కల్చరల్ : కడప నగరంలోని సీఎస్ఐ హైస్కూలు ప్రధానోపాధ్యాయినిగా ఉద్యోగ విరమణ చేస్తున్న సుదేవి సుహవాన ఉద్యోగ జీవితంలో స్ఫూర్తిదాయకమైన సేవలు అందించారని రాయలసీమ డయాసిస్ బిషప్ డాక్టర్ రైట్ రెవరెండ్ పి.ఐజాక్ వరప్రసాద్, భారతి దంపతులు అన్నారు. ప్రధానోపాధ్యాయిని పీసీ సుదేవి గురువారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా పి.ఐజాక్ వరప్రసాద్ దంపతులు, స్థానిక ప్రముఖులు ఆమెతోపాటు భర్త మునిరాజును ఘనంగా సత్కరించారు. పూర్వ ప్రధానోపాధ్యాయులు పి.డేనియల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

కడప సెవెన్‌రోడ్స్ : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి కోరారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా ఒకే తరహాలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పొరుగు రాష్ట్రాల్లాగా ఇక్కడ కూడా సంక్షేమ బోర్డులను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ కేసీ బాదుల్లా, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ఓ ఆయుధం

పెండ్లిమర్రి : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు శక్తి వంతమైన ఆయుధమని ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం నెహ్రూ యువకేంద్రం, సాయిసేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్‌: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాష అన్నారు. గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్ దగ్గరలోని ఆరోగ్య మాత చర్చి పక్కనున్న శ్రీరామ్ నగర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్.నాగ జ్యోతి అనే మహిళ మాట్లాడుతూ తన కుటుంబానికి ఎంతో లబ్ధి చేకూరిందని, పింఛన్ కోసం దూరాభారం వెళ్లే వారిమని, ఇప్పుడు వాలంటీరు వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారని హర్షం వ్యక్తం చేసింది. అలాగే జగనన్న ఇంటి స్థలం, నిర్మాణానికి నగదు, జగనన్న అమ్మ ఒడి, వైఎస్ ఆర్ పింఛన్ కానుక పథకాల ద్వారా రూ.11.04లక్షలు లబ్ధి పొందామని, ఈ ప్రభుత్వానికి బాసట గా ఉంటామని ఆనందం వ్యక్తం చేసింది.

– షేక్ తన్విషా బాను అనే మహిళ మాట్లాడుతూ మన జిల్లా ముద్దుబిడ్డ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుండి మా కుటుంబానికి లబ్ధి చేకూరుతోంని ఆనందం వ్యక్తం చేసింది. ఇందులో ఇంటి స్థలం, ఇంటిని నిర్మించుకోవడానికి నగదు, జగనన్న అమ్మ ఒడి, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ పింఛన్ కానుక వంటి పథకాల ద్వారా రూ. 10,38,738 లబ్ధి చేకూరిందని చెప్పింది.

ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ శిరీష, మాజీ కార్పొరేటర్ లక్ష్ముమయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్బరాయుడు, తోటక్రిష్ణ, షఫీ, పి. జయ చంద్రారెడ్డి, సంపత్, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో వైద్యవృత్తి మహోన్నతమైనది



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు డాక్టర్ బి. ఆంజనేయ ప్రసాద్

కడప అర్బన్‌: సమాజంలో వైద్య వృత్తి మహోన్నతమైనదనిని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. ఆంజనేయ ప్రసాద్ తెలియజేశారు. కడప ప్రభుత్వ వైద్యకళాశాల ఆవరణలోని బాయ్స్ హాస్టల్ గ్రౌండ్‌లో గురువారం సాయంత్రం 2018 బ్యాచ్ (రిమ్స్) గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బి. ఆంజనేయప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. వైద్య విద్య కోర్సు పూర్తి చేసుకున్న తరువాత వైద్య పరీక్షలు చేసే సమయంలో తమ దగ్గరికి వచ్చిన రోగులను ఆప్యాయంగా పలుకరించాలన్నారు. రోగులు త్వరగా ఉపశమనం పొందేలా తమ వంతుగా వైద్యులు కృషి చేయాలన్నారు. ఈ విధానాన్ని ప్రతి వైద్యుడు అలవరచుకోవాలన్నారు. ఉత్తమ సేవలు అందించినపుడే ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. ఈ దిశగా వైద్యులందరూ ముందుకుసాగాలన్నారు.

ఈ కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.వి రమాదేవి, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు, కడప కేన్సర్ కేర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. వాణితో పాటు, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

దేశం 'విశ్వగురు'గా అవతరించడంలో యువత పాత్ర కీలకం



మాట్లాడుతున్న వైవీయూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్.షావల్లీఖాన్

వైవీయూ: యువత క్రియాశీలకంగా వ్యవహరిస్తే 2047 నాటికి భారతదేశం 'విశ్వ గురు' గా అవతరించడం ఖాయమని యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్. షావల్లిఖాన్ అన్నారు. గురువారం వైవీయూలోని నూతన పరిపాలన భవనం అన్నమాచార్య సెనేట్ హాల్ లో జాతీయ సేవా పథకం యూనిట్ –9 ఆధ్వర్యంలో ×యువ సంవాద్ ఇండియా– 2047‡ పేరుతో భారత ప్రధాని నరేంద్ర మోడీ నిర్దేశించిన ×పంచ ప్రాణ్‌ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ వారసత్వ సంపద, సంస్కృతి గర్వించదగినవన్నారు. ప్రజలంతా ఐక్యంగా, సార్వభౌమాధికారం కలిగి ఎవరి బాధ్యతలను వారు నిర్వర్తించాలన్నారు. మంచి కోసం మాట్లాడుకోవాలని ×యువ సంవాద్‌‡ చెబుతోందన్నారు. వైవీయూ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య కె. కృష్ణా రెడ్డి మాట్లాడుతూ దేశంపై ప్రేమాభిమానాలు చూపుతూ, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించే యువత వల్ల భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన కడప రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి అనుపమానంద ప్రసంగిస్తూ భారతదేశమంటే త్యాగానికి, సేవకు నిదర్శనం అన్నారు. మంచి ఆలోచనలు, ప్రవర్తనతో పవిత్రమైన భారతావని సృష్టించేందుకు యువత సన్నద్ధం కావాలన్నారు. యువతలో ఎంతో శక్తి ఉందని దానిని సన్మార్గం వైపు తీసుకెళ్లాలన్నారు. స్వామి వివేకానందుడి మాటలు గుర్తుకు తెస్తూ యువతకు ప్రేరణ కల్పించారు. పార్లమెంట్ ప్రసంగానికి ఎంపికైన విద్యార్థిని సానియా మాట్లాడుతూ దేశంలో ఉన్న యువత సంకల్పిస్తే 2047 నాటికి విశ్వగురుగా అవతరించడం ఖాయమన్నారు. ఎన్.ఎస్.ఎస్. సమన్వయకర్త డా.ఎన్. వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి నేటి యువత ఆలోచనలు, సలహాలు, సూచనలు తీసుకొని, వారిని చైతన్యం చేయడం ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు.

ఈ కార్యక్రమ కన్వీనర్, జాతీయ సేవా పథకం యూనిట్ –9 ప్రోగ్రామ్ అధికారి డా కె.శ్రీనివాసరావు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. పలువురు యువకులు దేశాభివద్ధికి పలు సూచనలు చేశారు. అనంతరం యువతతో 'పంచ ప్రాణ్' ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడపలో ఘర్షణ వాతావరణానికి కారణం టీడీపీనే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్‌: ప్రశాంతంగా ఉన్న కడప నగరంలో ఘర్షణ పూరిత వాతావరణం ఏర్పడటానికి ప్రధాన కారణం తెలుగుదేశం పార్టీయేనని టీటీడీ బోర్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమ బాబు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొగున్ని కొట్టి మొగసాలకు ఎక్కినట్లు టీడీపీ నేతల వైఖరి ఉందన్నారు. తమ కార్పొరేటర్ తనయుడిని టీడీపీకి చెందిన యువకుడు కత్తితో పొడిస్తే తమ పార్టీ నాయకులు కేసు పెట్టడానికి టూ టౌన్ పోలీస్‌స్టేషన్ వెళ్లారని, అప్పటికే అక్కడ ఉన్న టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డి, అతని అనుచరులు రెచ్చగొట్టేలా అరుపులు, కేకలు వేశారన్నారు. మీ ప్రభుత్వం ఉండేది రెండు నెలలే, ఆ తర్వాత ఎవరినీ వదిలిపెట్టం...ఖబడ్దార్ అని హెచ్చరించారన్నారు. తమ పార్టీ వ్యక్తిని పొడిచిందిగాక ఇలా రెచ్చగొట్టడంపై డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్‌బాషా ఆవేశానికి గురై మాట్లాడారన్నారు. టీడీపీ నేతలు రెచ్చగొట్టడం వల్లే ఆయన అలా మాట్లాడారని, ఇందులో ఎలాంటి దురుద్దేశ్యం లేదన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కావాలని కయ్యానికి కాలు దువ్వుతూ, కడపలో హిందూ, ముస్లింల మధ్య చిచ్చురేపాలని చూస్తున్నారని మండిపడ్డారు. తాము చెప్పిన విషయాలు తప్పు అని భావిస్తే కాణిపాకం వినాయకునికి వద్ద ప్రమాణం చేసేందుకు సిద్ధమేనని సవాల్ చేశారు. 2017లో బక్రీదు రోజు గొడవ జరిగితే అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న అంజద్‌బాషా హిందువుల పక్షాన నిలిచి ఘర్షణ పెద్దది కాకుండా చూశారని గుర్తు చేశారు. జిల్లాలో వైఎస్సార్ హయాంలో మాత్రమే అభివృద్ధి జరిగిందని, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే జరుగుతోందని తెలిపారు. కడపను ఎవరు అభివృద్ధి చేశారో వారికే ఓటు వేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరే టర్లు పాకా సురేష్ కుమార్, సానపురెడ్డి శివకోటిరెడ్డి, బాలస్వామిరెడ్డి, షంషీర్, సూర్యనారాయణరావు, రామలక్ష్మణ్‌రెడ్డి, నాగేంద్ర, బాబు, జఫ్రుల్లా, డివిజన్ ఇన్‌చార్జులు శ్రీరంజన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బాలక్రిష్టారెడ్డి, సుబ్బరాయుడు, రెడ్డి ప్రసాద్, జహీ ర్, కమాల్‌బాషా, జిలాన్, బసవరాజు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



అనిమెల గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా మండలంలోని సంగమేశ్వరుని దర్శించుకుని అనంతరం అనిమెల గ్రామ సర్పంచు నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మంచి మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగాలని కావున ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ తరపున ప్రచారం చేసేందుకు అన్ని పార్టీల నాయకులు సిద్ధమయ్యారన్నారు. మీ బిడ్డ జగన్‌మోహన్‌రెడ్డికి మీరే ప్రచార సారథులు కావాలని ప్రజలను ఆయన కోరారు. కేవలం ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు తరువాత ఆ మాటలను మరిచే నాయకుడు చంద్రబాబు అయితే ఇచ్చిన హామీలను 100 శాతం పూర్తి చేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల కన్వీనర్లు రఘునాథరెడ్డి, ఉత్తమారెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కుమార్‌యాదవ్, భాస్కర్, సురేష్‌యాదవ్, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, వీరపునాయునిపల్లె మండల జేసీఎస్ కన్వీనర్ మహేంద్రారెడ్డి, రాష్ట్ర అగ్రికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాదురెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య, వీరపునాయునిపల్లె మండల పరిశీలకుడు రాజుపాలెం జగన్‌రెడ్డి, సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి, అనిమెల నాయకులు శ్రీనివాసుల్‌రెడ్డి, శంబురెడ్డి, నియోజకవర్గంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిత్వం జీవితాన్ని పరిమళింపజేస్తుంది

– కలెక్టర్ విజయరామరాజు



వెంకట రమణను సత్కరిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : మంచి వ్యక్తిత్వం, విధి నిర్వహణలో మచ్చలేని సేవలు ఒక ఉద్యోగి జీవితాన్ని పరిమళింపజేస్తాయని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. గురువారం కలెక్టరేట్ సూపరింటెండెంట్ (తహసీల్దార్) గుంటి వెంకట రమణ ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో పారదర్శకంగా పనిచేసినపుడు అన్ని స్థాయిల నుంచి గుర్తింపు, ప్రశంసలు అందుతాయన్నారు. 39 ఏళ్ల తన రెవెన్యూ సర్వీసులో వెంకట రమణ వివిధ హోదాల్లో పనిచేసి కలెక్టరేట్‌లో ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ఎలాంటి ఒత్తిళ్లు లేని శేష జీవితాన్ని ప్రశాంతంగా, కుటుంబ సభ్యులతో గడిపేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం సూపరింటెండెంట్ వెంకట రమణను శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఓఎస్‌డీ రఘునాథ్, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ్‌కుమార్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

శ్రీరంగనాథుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథుని కాంప్లెక్స్‌లో ప్రాచీన దేవాలయమైన శ్రీరంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా 8వరోజు గురువారం రాత్రి శ్రీరంగనాథస్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి అశ్వవాహనంపై వెలుతున్న తీరు, అమ్మవార్లు ముందు పల్లకిలో అలిగినట్లు వెలుతున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామోత్సవంలో భక్తులు విశేష పూజలు చేశారు.

బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న మను ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్

కడప ఎడ్యుకేషన్‌: జాతీయ సైన్సు డే పురస్కరించుకుని కడపలోని మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో కడప పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి మొదటి రెండు బహుమతులను సాధించారు. పోస్టర్ ప్రెజెంటేషన్‌లో 9వ తరగతి చదువుతున్న సయ్యద్ ఫజియా మొదటి బహుమతి అందుకోగా, మోడల్ ప్రెజెంటేషన్‌లో అదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆఫిపా, షేక్ నాజియాలు రెండవ బహుమతిని అందుకున్నారు. సంబంధిత బహుమతులను మను పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ విద్యార్థులకు అందచేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో విద్యలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీస్ స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్‌పీర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు రోల్ మోడల్‌గా ఉండాలి



రహమతుల్లాను సన్మానిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప ఎడ్యుకేషన్‌: పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు విద్యార్థులకు రోల్ మోడల్‌గా ఉండాలని కడప నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ పేర్కొన్నారు. పాత కడప జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు రహమతుల్లా గురువారం పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ హాజరై మాట్లాడారు. అనంతరం రహమతుల్లాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 ఇర్షాద్ అహమ్మద్, హెచ్ఎం విశ్వభారతి పాల్గొన్నారు.

జాబ్ ఫెస్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలి

– కడప ఉన్నత విద్య ఆర్‌జేడీ డా. బాబు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధికారులు

వైవీయూ: ఏపీ కళాశాల విద్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ ఫెస్ట్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని కడప ఉన్నత విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ బాబు పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏపీ కళాశాల విద్య, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జేకేసీ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ విద్యార్థులు చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా నైపుణ్యాలను సంపాదించాలన్నారు. ప్రభుత్వం సైతం చదువుతో పాటు నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడుతూ చదివే చదువు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉపాధి కల్పన దిశగా ఇలాంటి ఫెస్ట్‌లు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కళాశాల నోడల్ రీసోర్స్ సెంటర్ పరిధిలోని కడప, మైదుకూరు, పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 105 మంది విద్యార్థులు జాబ్ ఫెస్ట్‌కు హాజరుకాగా వీరిలో ప్రతిభ కనబరిచి 76 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ఎన్‌ఆర్‌సీ కోఆర్డినేటర్ డా. కె.వి.ప్రసాద్, డా. ఎం.వి. రమణయ్య, వినోద్, రఘునాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్‌: రానున్న వేసవి కాలంలో కడప నగరంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం అమృత్ ఒకటో దశ కింద సెంట్రల్ జైలు, ప్రకాష్ నగర్ ఎస్సీ హాస్టల్, స్కావెంజర్స్ కాలనీ, మాసాపేట, పాతకడప ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులను ఆయన పరిశీలించారు. ప్రకాష్ నగర్ ఎస్సీ హాస్టల్ వద్దనున్న ట్యాంక్‌కు ఇంటర్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. బీసీ హాస్టల్ వద్ద వాటర్ ట్యాంక్ వద్ద డిస్ట్రిబ్యూషన్ లైన్ కోసం తవ్విన రోడ్డుకు మరమ్మతులు చేయించాలన్నారు. శివాలయం వద్ద ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బోరు వేయాలన్నారు. స్కావెంజర్ కాలనీ ఈఎల్ఎస్ఆర్‌కు ఇంటర్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. మాసాపేట ట్యాంకు నుంచి ఇన్‌లెట్, ఔట్‌లెట్ పైపులైన్ ద్వారా రెండు వారాల్లో ప్రజలకు నీటి సరఫరా చేయాలన్నారు. పాత కడప ట్యాంకు నందు నీటిని నింపి, ప్రజలకు నీటి సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, ఈఈ కరిముల్లా ఖాన్, డీఈ వేణుగోపాల్, ఏఈ మణిగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.